క్లుప్తంగా

పెద్ద మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పెద్ద మసీదు(షియా జామియా జాఫరీ మసీదు)లో బుధవారం రాత్రి మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ విందులో ఎంపీపీ అంబటి భవాని, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ పాల్గొని మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. మత గురువు మౌలానా అస్కరీ హుస్సేన్, గ్రామ ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి మహ్మద్ జాఫర్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు అలీహుస్సేన్, నాగులు, సాయి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లాలమ్మ అమ్మవారి తీర్థం

కె.గంగవరం: అముజూరు గ్రామ దేవత గొల్లాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన జాతరలో బుట్టబొమ్మలు, గారడీలు, బ్యాండుమేళాలు, కోయడ్యాన్సులు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జాతర అనంతరం బుధవారం ఆలయాల వద్ద తీర్థం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు పంపన సుబ్బారావు, టీడీపీ ఇన్‌చార్జు రెడ్డి సుబ్రహ్మణ్యం, గ్రామ పెద్దలు పెంకే రవిచంద్ర, నానాపరపు శ్రీనివాస్, మేడిశెట్టి శ్రీను తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

రాయవరం: గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో డి.శ్రీనివాసు, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ బుధవారం పరిశీలించారు. పంట బోదెల పూడిక తీత పనులను పరిశీలించిన అనంతరం వారు ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. వేసవిలో అదనపు వేతనం రూ.257ల నుంచి రూ.272లకు పెరిగినట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జనిపల్లి సుధారాణి తెలిపారు. పనికి వచ్చే కూలీలు తప్పనిసరిగా గతంలో ఇచ్చిన గునపం, పార, తట్ట పట్టుకుని రావాలన్నారు. ఈఎంఎంఎస్ యాప్ ద్వారానే కూలీల మస్టర్లు వేయాలని, కూలీలకు వేతనం రాదని తెలిపారు.

పంట కోత ప్రయోగం



పంట కోత ప్రయోగం వివరాలు వెల్లడిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: కాపవరంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం పంట కోత ప్రయోగం చేశారు. ఈ ప్రయోగంలో ఎకరాకు 41 బస్తాలు పండినట్టు వెల్లడించారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ పంట కోత ప్రయోగాలు మొదలు పెట్టినట్టు ఆయన తెలిపారు. ఆయనతోపాటు ఏఎస్ఓ సురేష్, డీవైఎస్ఓ సత్యనారాయణమ్మ, గ్రామ సర్పంచ్ యనదల మంగాదేవి, ఎంపీటీసీ రెడ్నం సతీష్, రిలయన్స్ టీం, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఎం.నవ్యసుధ, రైతులు పాల్గొన్నారు.

ఏసు బోధనలు అనుసరణీయం



పడమర ఖండ్రికలో మాట్లాడుతున్న స్టీవెన్

కపిలేశ్వరపురం: ఏసుక్రీస్తు బోధనలు నేటి సమాజానికి అనుసరణీయమని ప్రముఖ క్రైస్తవ బోధకుడు వి.స్టీవెన్ అన్నారు. పడమర ఖండ్రికలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి వద్ద పాస్టర్ జి.రూబెన్ ఆధ్వర్యంలో మంగళవారం క్రైస్తవ రక్షణ సువార్త సంగీత పండగలు ప్రారంభమయ్యాయి. ప్రభు భూషణ్, ప్రసన్న బోల్డ్‌లు క్రీస్తుని కీర్తిస్తూ గేయాలను ఆలపించారు. వక్తలు మాట్లాడుతూ బైబిల్‌లోని వాక్యాలను ఆచరించడం ద్వారా మంచి ప్రవర్తన, వికాసం కలుగుతుందన్నారు. పడమర ఖండ్రిక, అంగర గ్రామాల క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 21 వరకూ పండగలు కొనసాగుతాయని రూబెన్ తెలిపారు.

సమస్య పరిష్కారానికి చర్యలేవీ?

మండపేట: పట్టణ ప్రజలను పట్టి పీడిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ప్రశ్నించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మసీదు స్థలం వివాదంలో ఆజ్యం పోయాలని చూసిన రాబందులు ఎవరో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చెప్పాలన్నారు.

స్మార్ట్ గ్రంథాలయాలు

- సామాజిక మాధ్యమం వేదికగా విజ్ఞాన వికాసం
- పుస్తక పఠనం కోసం సోషల్ మీడియా గ్రూపులు
- విలువైన పాతకాలం నాటి పుస్తకాలు సైతం లభ్యం
- సాహిత్యాభిమానుల వినూత్న కృషి
- వేసవిలో మరింత పెరిగిన పుస్తక పఠనం



ఎవరీ ఛత్రపతి శివాజీ పుస్తకాన్ని చూపుతూ అందులో అంశాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు (ఫైల్)


కపిలేశ్వరపురం: కాలం మారుతున్న కొద్దీ మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. పక్క పక్కనే ఉంటున్న మాట్లాడుకోవడం తక్కువే. ప్రస్తుతం కంప్యూటర్లు, ఫోన్లలో చాటింగ్ పెరిగిపోయింది. సామాజిక అంశాలపై వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో చర్చ ఎక్కువైంది. ఇదంతటికీ గత కాలపు మంచిని ప్రతిబింబించే మంచి పుస్తకాల పఠనం లేకనో సాహిత్య సభల నిర్వహణ తగ్గిపోవడమో, మంచీ చెడులను విశ్లేషించే సభలు, సమావేశాలు లేకపోవడం వల్లనే జరుగుతోందని అభ్యుదయవాదులు చెబుతున్నారు. ఇదంతా ఒకెత్తయితే గతకాలపు మంచిని పది మందికి పంచే వారసత్వాన్ని తాము కొనసాగిస్తామంటూ ముందుకొస్తున్నారు అనేక మంది ఆలోచనాపరులు. అందుకోసం వాట్సాప్, టెలిగ్రామ్ లాంటి సామాజిక మాధ్యమాల్లో గ్రూపు కట్టి సాహిత్య సంపదను పది మందికి పంచి పెడుతున్నారు.

రెండు నియోజకవర్గాల్లో సామాజిక కృషి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సాహిత్య, సామాజిక అభివృద్ధి కృషికి పెట్టింది పేరు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలకు సైతం అందులో భాగస్వామ్యముంది. రామచంద్రపురానికి చెందిన డాక్టర్ చెలికాని రామారావు భారత పార్లమెంట్‌లో తొలి పార్లమెంటేరియన్‌గా సేవలందించారు. డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ పేరుతో ఆయన కుమారుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ సమకాలిన అంశాలపై రచయితలు, సాహితీవేత్తలు, ప్రగతిశీల శక్తులను ప్రోత్సహిస్తూ అనేక పుస్తకాలను ప్రచురించి పాఠకలోకానికి అందజేస్తున్నారు. రామచంద్రపురం, కాజులూరు, మండపేట, అంగర, తదితర ప్రాంతాల్లో అనేక మంది సాహిత్య కృషి చేస్తున్నారు.

సామాజిక గ్రూపులతో సాహిత్య కృషి

కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన పెద్దింశెట్టి రామకృష్ణారావు 'పుస్తకం' పేరుతో ఓ వాట్సాప్ గ్రూపును రూపొందించి సాహిత్య కృషి చేస్తున్నారు. రామచంద్రపురంలో డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ, మండపేట కేంద్రంగా సంగమం పేరుతో ప్రముఖ హోమియో డాక్టర్ చల్లా రవికుమార్, పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి పుస్తక పఠనానికి ఊపిరి పోస్తునర్నారు. గ్రూపు సభ్యులు తమ వద్ద ఉన్న పీడీఎఫ్ ఫార్మాట్‌లోని వివిధ రకాల పుస్తకాలను గ్రూప్‌లో పోస్ట్ చేసుకుంటున్నారు. చదివిన అనంతరం వాటిపై చర్చించుకుంటూ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. పుస్తకం గ్రూపు తరచూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో సాహితి సభలను సైతం నిర్వహిస్తోంది.



గ్రూపు గుర్తింపు కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకం ఎంబ్లం

మానవ సమాజ గమనానికి అధ్యయనమే కీలకం



మానవ సమాజంలో ఆధునికత పేరుతో విచ్చలవిడి పరిస్థితులు కనిపిస్తున్నాయి. మెరుగైన సమాజానికి పుస్తక పఠనమే చోదక శక్తి అని గమనించి పుస్తకం పేరుతో 2017 డిసెంబర్ 4న గ్రూపును ప్రారంభించాను. గ్రూపు లోగోను ప్రముఖ రచయిత్రి ఓల్గా ఆవిష్కరించారు. కాకినాడకు చెందిన మార్క్సిస్టు గ్రంథాల రచయి రావు కృష్ణారావు వంటి ప్రముఖులు అనేక విలువైన పుస్తకాలను గ్రూపు సభ్యులకు అందిస్తున్నారు. జిల్లాతో పాటు ఆంధ్ర, తెలంగాణ, బెంగళూరు ప్రాంతాల నుంచి సభ్యులుగా ఉన్నారు. వారిలో వైద్యులు, లాయర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, దళిత, కార్మిక, ఉద్యోగ, మహిళా రంగాల వారు, సామాన్యులు ఉన్నారు.

–పెద్దింశెట్టి రామకృష్ణారావు, అంగర, సామాజిక కార్యకర్త

గ్రూప్ సభ్యులు పోస్టు చేస్తున్న పుస్తకాలివే..

నీతి కథలు, చిన్నపిల్లల కథలు, చందమామ కథలు, ప్రపంచ చరిత్ర, పలు రంగాలకు చెందిన వారి జీవిత చరిత్రలు, అభ్యుదయ, దళిత, కమ్యూనిజం, మతం, తత్వశాస్త్రం, సైన్స్, ఆర్థిక, సామాజిక, విద్య, వైద్యం, సాంస్కృతిక అంశాలకు చెందిన రచనలను సభ్యులు పోస్ట్ చేసుకుంటున్నారు. ప్రస్తుత కాలంలో మార్కెట్‌లో అందుబాటులో లేని పాత కాలం నాటి పుస్తకాలు సైతం గ్రూపు పుణ్యమా అని సభ్యులకు అందుతుండటం విశేషం.

బీసీ జనగణనపై మంత్రికి కృతజ్ఞతలు



మంత్రి వేణును సత్కరిస్తున్న సంఘం నేతలు

రామచంద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం బీసీ జనగణనపై చర్యలు చేపట్టినందుకు ద్రాక్షారామ, పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘంల ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి వేణుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘానికి ద్రాక్షారామలో భవనం నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ సంఘం అధ్యక్షుడు తీపర్తి లక్ష్మీనారాయణ, పట్టణ సంఘం అధ్యక్షుడు ఆచంట వెంకటసుబ్బారావు, కార్యదర్శులు సుందరపల్లి సురేష్, చింతలపూడి సత్తిబాబు, నాయకులు పసలపూడి వీరబాబు, సుందరపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

రామచంద్రపురం: స్థానిక మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మే 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జస్టిస్ కె.మాధవీదేవి బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ నేషనల్ లోక్ అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంక్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడ్డ క్రిమినల్ కేసులు పరిష్కామవుతాయన్నారు. ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సామాన్యుడి సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- నల్లూరులో గడప గడపకూ మన ప్రభుత్వం



నల్లూరులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: సామాన్య ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. నల్లూరులో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ తోటను గ్రామస్తులు పూలమాలలతో స్వాగతం పలికారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కురుపూడి శివశంకర్, నాయకులు రాంబాబులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలెదురైనా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం చైర్మన్ సిద్దాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మార్ని పూసబ్బు, సవిలే శరత్‌బాబు, సచివాలయ కన్వీనర్లు అతికెల శంభులింగం, సవిలే జయంత్, వాసంశెట్టి అశోక్ కుమార్, మండపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ కుడుపూడి భువనేశ్వరి, పలు గ్రామాల ఎంపీటీసీలు పలివెల మధు, అడ్డాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సర్వే పూర్తి చేయాలి

ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం



అంగర ఆర్బీకే సర్వేపై మాట్లాడుతున్న ఆర్డీఓ

కపిలేశ్వరపురం: గ్రామాల్లో చేపట్టిన భూ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని రామచంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగరలోని ఆర్బీకేను బుధవారం ఆమె సందర్శించారు. మండల సర్వేయర్ నాగేశ్వరరావు సర్వే తీరును వివరించారు. సర్వేను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

తాతపూడి ర్యాంపు సందర్శన

తాతపూడి ఇసుక ర్యాంపును ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ర్యాంపును పరిశీలించారు. కోర్టు ఆదేశాలున్నందున ర్యాంపులోని బాటను తొలగించాలని ఇరిగేషన్, హెడ్‌వర్క్స్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ బాలాజీ, రీసర్వేయర్ శ్రీరామ్, వీఆర్వోలు, వ్యవసాయ, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

ఆరేళ్ల లోపు చిన్నారులందరికీ ఆధార్



బ్రాడీపేట ఆధార్ నమోదు కేంద్రంలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న డీఎల్‌డీఓ శాంతి

రామచంద్రపురం రూరల్: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకుని 0 నుంచి 6 సంవత్సరాలలోపు చిన్నారులందరికీ ఆధార్ నమోదు చేసేలా సమన్వయంతో పని చేయాలని రామచంద్రపురం డీఎల్‌డీఓ ఎ.శాంతి సూచించారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సూర్‌వైజర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. డీఎల్‌డీఓ శాంతి మాట్లాడుతూ చిన్నారుల ఆధార్ నమోదు నూరు శాతం పూర్తయ్యేలా అన్ని శాఖల సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఎంపీడీఓ ఎస్.సెలత్‌రాజు, ఏఓ వెంకట అచ్యుతరామసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రామచంద్రపురం: పట్టణంలోని బ్రాడీపేట వార్డు సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని రామచంద్రపురం డీఎల్‌డీఓ ఎ.శాంతి బుధవారం తనిఖీ చేశారు. ఆధార్ నమోదు ప్రక్రియను, సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆధార్ నమోదు చేయించుకున్న పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

గొల్లపుంత కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు



మండపేటలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి



శీలలంకలో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న గృహసారథులు, పార్టీ నాయకులు

మండపేట: మూడున్నరేళ్లలో చేసిన ప్రగతిని వివరించడం, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం లక్ష్యంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోంది. మండపేట గొల్లపుంత కాలనీలో బుధవారం సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఆధ్వర్యంలో కార్యక్రమం సందడిగా సాగింది. కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో చైర్‌పర్సన్ దుర్గారాణి కాలనీలో ఇంటింటికీవెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా ? సీఎం జగన్ పరిపాలన ఏవిధంగా ఉంది?, గత టీడీపీ పాలనకు వైఎస్సార్ ప్రభుత్వ పాలనకు వ్యత్యాసం గురించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. అనంతరం వారి కోరిక మేరకు ఇళ్లకు, సెల్‌ఫోన్లకు సీఎం వైఎస్ జగన్‌చిత్రంతో రూపొందించిన స్టిక్కర్లను అతికించారు. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణి మీడియాతో మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి వాడవాడలా అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. కౌన్సిలర్లు కొవ్వాడ బేబి, శెట్టి కల్యాణి, గ్రంధి శ్రీనివాస్, నీలం దుర్గ, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పార్టీ నాయకుడు సాధనాల శివభగవాన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు ప్రజాదరణలో తిరుగులేదు

కాజులూరు: పేదల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికు ప్రజాదరణలో తిరుగులేదని ఒంటితాడి సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ అన్నారు. బుధవారం ఒంటితాడి శివారు శీలలంకలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. స్టిక్కర్లు, కరపత్రాలు పంచిపెట్టారు.

పాఠశాలల్లో నైట్ వాచ్‌మన్‌ల నియామకానికి చర్యలు

రాయవరం: కోట్లాది రూపాయలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిన పాఠశాలల సంరక్షణకు నైట్ వాచ్‌మన్‌లను నియమించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 618 ఉన్నత పాఠశాలల్లో నియామకానికి చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 182, కాకినాడ జిల్లాలో 212, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో224 పోస్టులను భర్తీ చేస్తారు. వీరికి నెలకు రూ.6వేలు చెల్లిస్తారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తల్లిదండ్రుల కమిటీలు నైట్ వాచ్‌మన్‌లను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ నెలాఖరుకు ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు నైట్ వాచ్‌మన్‌ల నియామకానికి చర్యలు చేపడతారని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి తెలిపారు.

పచ్చిరొట్టతో భూమికి సారం

రాయవరం: భూసారం పెంచుకునే చర్యల్లో భాగంగా రైతులు రెండో పంట అనంతరం పచ్చిరొట్ట ఎరువులు వేయాలని జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారువెంకటరెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణలు రైతులకు పిలుపునిచ్చారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లిపెసలు, మినుము, జనుము తదితర విత్తనాలను చల్లుకోవడం వలన భూసారం పెరిగి, ఎరువుల అవసరం తగ్గుతుందన్నారు. ప్రభుత్వం కూడా భూసారం పెంచాలని, రైతులకు మేలు చేయాలనే భావనతో 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేస్తుందన్నారు. ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ పిల్లి పెసలు ఎకరానికి 8-12 కేజీలు చల్లుకుంటే 45 రోజుల తర్వాత నేల సారవంతమవుతుందన్నారు. దీని వలన నత్రజని ఎరువుల మోతాదును తగ్గించుకోవచ్చునన్నారు. అనంతరం సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, జెడ్పీటీసీ మంగతాయారువెంకటరెడ్డి, ఎంపీపీ వెంకటరమణల చేతుల మీదుగా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేశారు. వార్డు సభ్యులు మామిడాల వెంకన్నబాబు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని వృద్ధుడి మృతి

కాజులూరు: ఇసుకలారీ ఢీకొని కాజులూరు గ్రామానికి చెందిన వృద్ధుడు పుల్లెపు చక్రం(68) మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి బుధవారం గొల్లపాలెం పోలీసులు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం.. పుల్లెపు చక్రం తన సైకిల్‌పై పొలానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. గ్రామంలో ఇసుకను దించి డ్రైవర్ లారీని వెనుకకు తిప్పుతున్న సమయంలో చక్రంను ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలైన అతనిని స్థానికులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదుల మేరకూ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఏఎస్సై డేవిడ్ తెలిపారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

రామచంద్రపురం రూరల్: చోడవరంలో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్టు రామచంద్రపురం ఎస్సై డి.సురేష్ బాబు బుధవారం విలేకరులకు తెలిపారు. అరెస్టు చేసిన వారి నుంచి రూ. 20,380 నగదు, 104 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కట్నం వేధింపులు

రామచంద్రపురం రూరల్: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారంటూ నెలపర్తిపాడుకు చెందిన ఇళ్ల సత్యసుందరి చేసిన ఫిర్యాదుపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్సై బి. వినోద్ బుధవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సత్యసుందరికి 2009లో రాయవరానికి చెందిన ఇళ్ల సత్యనారాయణతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. వివాహ సమయంలో రూ.3 లక్షలు కట్నం ఇచ్చారు. తర్వాత భర్త, అత్త, ఆడపడుచులు మరో రూ.2 లక్షలు కట్నం తేవాలంటూ వేధిస్తున్నారు. దీనితో బాధిత మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

రాయవరం: సోమేశ్వరం గ్రామ పరిధిలోని మాచవరం సెంటర్లో చోటు చేసుకున్న రహదారి ప్రమాదంలో కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఎస్సై సురేష్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అంకుత సత్యవతి ఈ నెల 17న రాత్రి 10 గంటల సమయంలో మాచవరం సెంటర్లో తన హోటల్ నుంచి రోడ్డు దాటుతుండగా ఆటో డ్రైవర్ వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో సత్యవతి తలకు, చేతిపైన బలమైన గాయాలు కాగా, రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఆయన తెలిపారు.

విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం పుష్కర కాలువలోకి తాగునీటి కోసం దిగిన పాడిగేదె విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. వివరాల్లోకి వెళితే..అచ్యుతాపురం గ్రామంలోని జాజుల శివన్నారాయణకు చెందిన పాడిగేదె బుధవారం గ్రామ శివారున ఉన్న పుష్కరకాలువలోకి నీటి కోసం దిగింది. ఈ క్రమంలో కాలువలో సాగునీటి కోసం అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారు వైర్లు తగిలి మృత్యువాత పడింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని రైతు తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



ఆర్యావటంలో తాతపూడి మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

కాజులూరు: గొల్లపాలెంలో బయోడీజిల్ ట్యాంక్‌లో పడి మృతి చెందిన ఆర్యావటానికి చెందిన తాతపూడి మహేష్ (25), శీలకు చెందిన నెరేడుమిల్లి శివకుమార్ (25)ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అన్నారు. బుధవారం రాజశేఖర్ తదితర నాయకులు ఆర్యావటం, శీల గ్రామాల్లో మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతికంది వచ్చిన కొడుకులు అర్థాంతరంగా మృతిచెందడంతో వారిపై ఆధారంపడి జీవించే ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం, రెండు ఎకరాల భూమి, ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కౌలురైతుసంఘం ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు, జిల్లా రైతుకూలీ సంఘం కన్వీనర్ టేకుమూడి ఈశ్వర్రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పవర్ టిల్లర్ల పంపిణీ

అనపర్తి: రామవరం రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం రైతులకు పవర్ టిల్లర్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా మంజూరైన ఈ యంత్రాలను గ్రామానికి చెందిన రైతులకు అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అందజేశారు

మన్యం కాదు.. మండపేటే..



మెయిన్ రోడ్డులో ఉదయం 7 గంటలకు లైట్ల వెలుతురులో వాహనాల రాకపోకలు



మండపేట గొల్లపుంత కాలనీని కమ్మేసిన పొగమంచు

మండపేట: ఇది సీతాకాలం కాదు.. వాగులు వంకలు కొండలు చెట్లు ఉన్న మన్యమూ కాదు. అయినా మంచు కురిసింది. అంతేకాకుండా ఇది ఎండలు మండుతున్న వేసవి కాలం. ఈ కాలంలో బుధవారం ఉదయం మండపేట పట్టణాన్ని పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల సమయం వరకు దట్టంగా కమ్ముకున్న పొగమంచుతో 10 మీటర్ల దూరం కూడా కనిపించక రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది. లైట్లు వెలుతురులో నెమ్మదిగా వాహనాలు ముందుకు సాగాయి. గతంలో ఎప్పుడు వేసవిలో ఇలా పొగమంచు కురవలేదని స్థానికులు అంటున్నారు.